

రైతు భరోసా కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఓర్వకల్లు ఎయిర్‌పోర్ట్‌లో పూలబొకేలతో స్వాగతం పలుకుతున్న మేయర్ బీవై రామయ్య, ఎంపీ సంజీవ్‌కుమార్, కర్నూలు, పాణ్యం ఎమ్మెల్యేలు హఫీజ్‌ఖాన్, రాంభూపాల్‌రెడ్డి, మాజీ ఎంపీ బుట్టా రేణుక, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి

క్లుప్తంగా

మహిళల కోసం జాబ్ మేళా



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

కర్నూలు(రాజ్‌విహార్): మహిళల కోసం ప్రత్యేకంగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు బుట్టా రేణుక తెలిపారు. గురువారం ఆమె తన కార్యాలయంలో ఉద్యోగ అవకాశాల వాల్ పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తిరుపతి సమీపంలోని శ్రీసిటీలో ఉన్న స్మార్ట్ మొబైల్ కంపెనీలో ప్రొడక్షన్ ఆపరేటర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఇవి కేవలం మహిళల కోసమే అన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థినులు 8332918999 నంబరుకు సంప్రదించాలని సూచించారు.

సర్వేయర్‌ను తొలగించాలి

కర్నూలు(సెంట్రల్): వెల్దుర్తి మండల సర్వేయర్ హేమంత్‌రెడ్డిని సస్పెండ్ చేసి విధుల నుంచి తొలగించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కె.జగన్నాథం డిమాండ్ చేశారు. గురువారం వెల్దుర్తి మండల సీపీఐ కార్యదర్శి కృష్ణతో కలసి ఆయన డీఆర్వో ఎస్వీ నాగేశ్వర రావుకు ఆయన కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. రైతులు సర్వే కోసం చలానాలు కట్టినా సర్వేయర్ కొలతలు వేయడం లేదని వారు ఫిర్యాదు చేశారు.

రేపు నగరపాలకసంస్థ సర్వసభ్య సమావేశం

కర్నూలు (టౌన్): ఈనెల 3న స్థానిక ఎస్‌బీఐ ఎంప్లాయీస్ కాలనీలో ఉన్న నగరపాలక సంస్థ నూతన కౌన్సిల్ హాలులో నగరపాలక సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు మేయర్ కార్యాలయ వర్గాలు గురువారం ఒక ప్రకటనలో తెలిపాయి. సమావేశానికి మేయర్ బీవై రామయ్య, కర్నూలు, పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు హఫీజ్‌ఖాన్, కాటసాని రాంభూపాల్ రెడ్డి, డాక్టర్ జరదొడ్డి సుధాకర్, కమిషనర్ భార్గవ్‌తేజలు హాజరవుతారని ప్రకటనలో తెలిపారు.

4న షుగర్‌పై అవగాహన సదస్సు

కర్నూలు(హాస్పిటల్): షుగర్ జబ్బుపై ఈనెల 4న అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి.చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు స్థానిక హెల్త్‌క్లబ్‌లో సదస్సు ప్రారంభమవుతుందని, షుగర్ జబ్బు లక్షణాలు, కారణాలు, చికిత్స గురించి ఎండోక్రైనాలజిస్టు డాక్టర్ భరత్ వివరిస్తారన్నారు.

సీఎంకు వినతి

కర్నూలు(అర్బన్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థలో ఔట్ సోర్సింగ్ పద్ధతిన విధులు నిర్వహిస్తున్న వర్క్‌ఇన్‌స్పెక్టర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, మండల ఇన్‌చార్జులను రెగ్యులరైజ్ చేయాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వామనగిరి హనుమన్న కోరారు. గురువారం పత్తికొండకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి ఆయన వినతి పత్రం అందించారు. వినతి పత్రం అందించిన వారిలో అసోసియేషన్ నేతలు యాసీన్, ఆలీ, వెంకటేష్, మోజెస్, లోకేష్, అనీల్ ఉన్నారు.

హజ్ యాత్రికులు రెండు రోజుల ముందే చేరుకోవాలి

కర్నూలు(రాజ్‌విహార్): హజ్ యాత్రికులు రెండు రోజుల ముందే గుంటూరు వద్ద ఉన్న హజ్ క్యాంపునకు చేరుకోవాలని రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు హఫీజ్ మంజూర్ అహ్మద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్లైట్ తేదీ కంటే రెండు రోజుల ముందు గుంటూరు సమీపంలోని హైవే వద్ద ఉన్న నంబూరు జామియా సిరాజుల్ ఉలూం మదరసాకు చేరుకోవాలన్నారు. అక్కడి నుంచి విజయవాడ ఎంబర్కేషన్ (గన్నవరం విమానాశ్రయం) నుంచి విమానాల ద్వారా వెళ్లేందుకు ఏర్పాట్లు చేయనున్నట్లు వెల్లడించారు.

వైస్‌చైర్మన్ బాధ్యతల స్వీకరణ

కర్నూలు (టౌన్): కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్‌గా ఎస్.ప్రతాప్ సూర్యనారాయణ రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనను ప్రభుత్వం వైస్ చైర్మన్‌గా నియమించింది. బాధ్యతలు చేపట్టిన ఆయనను కుడా ప్లానింగ్ ఆఫీసర్ విజయ భాస్కర్, జూనియర్ ప్లానింగ్ ఆఫీసర్ రాజేష్, సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

కర్నూలు(రూరల్): ఈ నెల 6 నుంచి 12వ తేదీ వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ అండర్ 19 పోటీలకు కర్నూలు ఒకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థి మారుతీ నాయక్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎస్ నాగస్వామి గురువారం తెలిపారు.



ఆకట్టుకుంటున్న సిటీ ఫారెస్ట్ ముఖ ద్వారం



పిల్లిగుండు



కిడ్స్ ప్లే ఏరియా

వన విహారం

- ఆహ్లాదకరంగా నగర వనం
- ప్రత్యేక ఆకర్షణగా జంగిల్ సఫారీ.. వాచ్ టవర్
- పెరుగుతున్న సందర్శకుల సంఖ్య

కర్నూలు కల్చరల్: పక్షుల కిలకిల రావాలు.. వయ్యారా లొలికే నెమళ్ల నృత్యాలు.. జింకల పరుగులు.. సేద తీరేందుకు చెట్ల కింద అరుగులు.. ప్రకృతిని వీక్షించేందుకు వాచ్ టవర్.. వాకింగ్, సైక్లింగ్ చేసుకునేందుకు చక్కని ట్రాక్.. జీవ వైవిధ్య ఆకృతులు.. అడవి అంతా చుట్టి వచ్చేందుకు జంగిల్ సఫారీ.. సమావేశాలు నిర్వహించుకునేందుకు ఓపెన్ థియేటర్.. ఆరోగ్యంగా ఉండేందుకు యోగా సెంటర్.. ఇలా ఎంతో ఆహ్లాదాన్నిస్తోంది నగర వనం(సిటీ ఫారెస్ట్). ఇక్కడికి వచ్చే వారి సంఖ్య కూడా ఏటేటా పెరుగుతోంది. కర్నూలు నగరం నుంచి నందికొట్కూరుకు వెళ్లే మార్గంలో 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న సిటీ ఫారెస్ట్ వీకెండ్స్‌లో సందర్శకులతో కిటకిటలాడుతూ ఉంటోంది. సుమారు 150 ఎకరాల్లో ఏర్పాటు చేసిన సిటీ ఫారెస్ట్‌ను అటవీ శాఖ అధికారులు ప్రజలు అభిరుచులకు అనుగుణంగా తీర్చిదిద్దారు.

నగర వనం టికెట్ ధరలు

- సిటీ ఫారెస్ట్‌లోకి వెళ్లాలంటే 10 ఏళ్ల లోపు వారికి రూ.10, పెద్దలకు రూ.20 టికెట్ తీసుకోవాలి.
- 5 కిలోమీటర్ల జంగిల్ సఫారీ చేయాలంటే ఆరుగురికి రూ.300 చెల్లించాలి.

సిటీ ఫారెస్ట్ ప్రత్యేకతలు

- సిటీ ఫారెస్ట్‌లో ఏర్పాటు చేసిన వాచ్ టవర్ ప్రత్యేకంగా నిలుస్తోంది. దీనిపైకి ఎక్కి చూస్తే నగర వనం మొత్తం కనిపిస్తుంది. ఇక్కడి నుంచి అలంపురం జోగులాంబ గుడి సుందరంగా దర్శనమిస్తుంది.
- 5 కిలోమీటర్లు జంగిల్ సఫారీ చేయవచ్చు. రెండు వాహనాలు సఫారీకి వినియోగిస్తున్నారు. వాహనాల్లో వెళ్తుంటే అడవిలోని జింకలు, నెమళ్లు దర్శనమిస్తాయి.
- పిల్లిగుండు మరో ప్రత్యేకత. దీన్ని ప్రస్తుత అటవీశాఖ చీఫ్ కన్సర్వేటర్ పి.రామకృష్ణ దత్తత తీసుకొని సుందరంగా తయారు చేయించారు. దీనిపై నుంచి పలు ప్రాంతాలను వీక్షించవచ్చు.
- ఇంటర్ ప్రిటేషన్ కేంద్రం మరో ప్రత్యేకత. ఇక్కడ సుమారు 15 రకాల పక్షులు, జీవ వైవిధ్య ఆకృతులు ఉన్నాయి.
- యోగా చేసుకోడానికి యోగా సెంటర్, చిన్నచిన్న సమావేశాలు, గెట్‌టుగెదర్ ఏర్పాటు చేసుకునేందుకు మినీ ఓపెన్ థియేటర్ ఉంది.
- జంగిల్ సఫారీకి 5 కిలోమీటర్ల ట్రాక్ రోడ్ ఉంది. వాకింగ్‌తో పాటు సైక్లింగ్ చేసుకోడానికి అనువుగా ఉంది.
- పిల్లలు ఆడుకోడానికి ప్రత్యేంకగా ప్లే ఏరియా, పార్క్ ఏర్పాటు చేశారు.
- నగర వనం పక్కనే సహసిద్ధమైన జలాశయం ఉంది. ఇక్కడ ఏపీ టూరిజం వారు బోటింగ్ ఏర్పాటు చేశారు. ఈ చెరువు చుట్టూ ఉదయం సాయంత్ర వేళల్లో సుమారు 4 వేల నుంచి 5 వేల పక్షులు సంచరిస్తూ ప్రత్యేక అనుభూతిని కలిగిస్తాయి.



సిటీ ఫారెస్ట్ వ్యూ

సిటీ ఫారెస్ట్ సందర్శకుల వివరాలు

సంవత్సరం	సందర్శకులు	వచ్చిన ఆదాయం(రూ.)
2020–21	31,690	10,98,170
2021–22	74,604	25,45,690
2022–23	1,04,249	29,95,120

ఆహ్లాదకరంగా గడపవచ్చు



నగర వనం కర్నూలుకు వరం లాంటిది. 150 ఎకరాల్లో విస్తరించి ఉంది. కాంక్రీట్ జనారణ్యంలో నుంచి బయటకు వచ్చి ప్రశాంతంగా సేద తీరేందుకు అన్ని వసతులు ఉన్నాయి. కుటుంబంతో వచ్చి ఆహ్లాదంగా గడపవచ్చు. వారాంతాలు, పండుగ రోజుల్లో వేలాది మంది సిటీ ఫారెస్ట్‌కు ఉదయం వచ్చి సంతోషంగా గడిపి సాయంత్రం వరకు ఉండి వెళ్తుంటారు. ఫండ్స్ ఇస్తే ఇంకా అభివృద్ధి చేయవచ్చు. రాష్ట్రంలోనే ప్రత్యేకంగా నిలుస్తుంది. – సూర్యచంద్రరాజు, అటవీ శాఖ కర్నూలు రేంజర్



సేద తీరేందుకు ఏర్పాటు చేసిన అరుగులు



జంగిల్ సఫారీలో విహరిస్తున్న కుటుంబం

బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్‌ను అరెస్టు చేయాలి

కర్నూలు(సెంట్రల్): రెజ్లర్లను లైంగిక వేధింపులకు గురిచేస్తున్న బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్‌ను వెంటనే అరెస్టు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం భారతీయ మహిళా మల్లయోధులు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తమ నిరసనను తెలపడానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ అఖిలపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో డిప్యూటీ కలెక్టర్ అనురాధకు వినతి పత్రం సమర్పించారు. ఈ వినతిపత్రాన్ని కలెక్టర్ ద్వారా భారత రాష్ట్రపతికి చేరేలా చూడాలని వారు ఆమెను కోరారు. కార్యక్రమంలో ఏఐకేఎస్ నాయకులు రామకృష్ణ, ఏఐకేకేఎంఎస్ నాయకులు ఖాదర్, వి.హరీష్‌కుమార్, రైతు స్వరాజ్య వేదిక నాయకులు పోతుల శేఖర్, ఏఐకేఎంఎస్ నాయకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో..

మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట కార్మికులు ధర్నాకు దిగారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, నాయకులు రామాంజనేయులు,జయరామిరెడ్డి,రాము, సోమన్న పాల్గొన్నారు.

నగరపాలక కార్యదర్శి బదిలీ

కర్నూలు (టౌన్): సాధారణ బదిలీల్లో భాగంగా నగరపాలక సంస్థ కార్యదర్శి ఎస్ఎస్ లావణ్య బదిలీ అయ్యారు. ఆమెను గుంతకల్లు కమిషనర్‌గా బదిలీ చేస్తూ జీఓ 344ను ప్రభుత్వం జారీ చేసింది. అక్కడ గ్రేడ్–3గా పనిచేస్తున్న షేక్ మాలిక్‌ను నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ గురువారం ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శ్రీలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు.

అటవీశాఖలో..

కర్నూలు కల్చరల్: అటవీశాఖలో పలువురు ఉద్యోగులకు స్థాన చలనం కలిగింది. ఫారెస్టర్ -1, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు -5, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్లు- 3, విలేజ్ ఫారెస్ట్ వర్కర్స్ -2 బదిలీ చేసినట్లు జిల్లా అటవీశాఖ అధికారి పి.శివశంకర్‌రెడ్డి పేర్కొన్నారు.

విద్యుత్ లైన్‌మెన్లు..

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ లైన్‌మెన్లకు స్థాన చలనం కలిగింది. సాధారణ బదిలీల్లో భాగంగా నిబంధనల మేరకు పలువురు లైన్‌మెన్లు, అసిస్టెంట్ లైన్‌మెన్లకు బదిలీ చేస్తూ కర్నూలు టౌన్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు రమేష్ ఉత్తర్వులు జారీ చేశారు.

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లు

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లలాంటివని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం కల్లూరు అర్బన్ 30వ వార్డు శరీన్ నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలనీలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. మురుగు కాలువల లోతు, విస్తీర్ణం పెంచాలని స్థానికులు ఎమ్మెల్యేకు విన్నవించగా ఆయన స్పందిస్తూ అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పేదల పక్షాన పోరాటం చేస్తూ, అన్ని సామాజిక వర్గాల అభివృద్ధికి కృషి చేయడంతో పాటు అర్హతే ప్రమాణికంగా భావించి సంక్షేమ ఫలాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జయరాముడు, లక్ష్మీకాంతరెడ్డి, కల్లూరు సొసైటీ చైర్మన్ శివశంకర్‌రెడ్డి, అర్బన్ వార్డుల జేసీఎస్ ఇన్‌చార్జ్ గోవర్ధన్‌రెడ్డి, నాయకులు పెద్దన్న, శివారెడ్డి, అహమ్మద్ దితరులు పాల్గొన్నారు.

చౌక్‌బాల్ క్రీడలో రాణించాలి



క్రీడాకారులను అభినందిస్తున్న చీఫ్ కోచ్ నటరాజన్

కర్నూలు(రూరల్): చౌక్‌బాల్ క్రీడలో రాణించాలని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ నటరాజ్ తెలిపారు. గురువారం నగరంలోని అవుట్ డోర్ స్టేడియంలో చౌక్‌బాల్ వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. విద్య, ఉద్యోగ రంగాల్లో క్రీడా కోటా ద్వారా అపార అవకాశాలున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ ఏదో ఒక క్రీడలో రాణించాలన్నారు. కార్యక్రమంలో చౌక్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఆర్‌యూలో ఏడుగురి సస్పెన్షన్

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయంలోని ఏడుగురి బోధనేతర సిబ్బందిపై సస్పెన్షన్ వేటు పడింది. కొందరు విద్యార్హత, పుట్టిన తేదీ నకిలీ ధ్రువప్రతాలు సమర్పించి ఉద్యోగాలు పొందినట్లు యూనివర్సిటీ దృష్టికి వచ్చింది. వారి ఒరిజినల్ సర్టిఫికెట్లను ధ్రువీకరించడానికి విశ్వవిద్యాలయం నిజనిర్ధారణ కమిటీని ఏర్పాటు చేసింది. సర్టిఫికెట్ల వాస్తవికతకు సంబంధించి అధికారుల నుంచి వచ్చిన లేఖలను ధ్రువీకరించిన తర్వాత కమిటీ ఆరోపణల నివేదికను ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశం ముందు సమర్పించింది. కమిటీ నివేదికను ఆమోదించిన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఏడుగురు ఉద్యోగులను సస్పెండ్ చేసినట్లు గురువారం విశ్వవిద్యాలయం అధికార యంత్రాంగం తెలిపింది.

9న సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రవేశ పరీక్ష

కర్నూలు కల్చరల్: కర్నూలు సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఈనెల 9న సిల్వర్ సెట్ – 2023 నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ సుబ్రహ్మణ్య కుమార్ తెలిపారు. పరీక్ష హాల్ టికెట్స్‌ను శుక్రవారం నుంచి కళాశాల వెబ్ సైట్ sjgckurnool.edu.in ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు.



ఉల్చాల హరిప్రసాద్‌రెడ్డికి కంటి పరీక్ష చేస్తున్న డాక్టర్ ఆదిమూలపు సతీష్

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

కర్నూలు(హాస్పిటల్)/లీగల్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇన్‌ఫర్మేషన్ కమిషనర్ ఉల్చాల హరిప్రసాద్‌రెడ్డి సూచించారు. జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్, మైపర్ డైరెక్టర్, కంటి వైద్యనిపుణులు డాక్టర్ ఆదిమూలపు సతీష్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం మున్సిఫ్‌కోర్టు ఆవరణలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఏడాదికి ఒకసారైనా హెల్త్ చెకప్ చేయించుకోవాలన్నారు. పరీక్షల అనంతరం వైద్యులను కలిసి వారి సలహా మేరకు ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని సూచించారు. శిబిరానికి వచ్చిన వారికి డాక్టర్ ఆదిమూలపు సతీష్‌తో పలువురు వైద్యులు వైద్యం చేసి, పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో కోర్టు జడ్జి కిశోర్‌కుమార్, సభ్యులు నారాయణరెడ్డి, నజీమ కౌసర్, సూపరింటెండెంట్ రాముడు, లక్ష్మీకాంతరెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రూపు–1 మెయిన్స్‌ను పకడ్బందీగా నిర్వహించండి

కర్నూలు(సెంట్రల్): ఈనెల 3 నుంచి ప్రారంభమయ్యే గ్రూపు–1 మెయిన్స్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ డీఆర్వో అనురాధ తెలిపారు. గురువారం ఆమె తన కార్యాలయంలో పరీక్షల సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లాలో కేవీ సుబ్బారెడ్డి కాలేజీలో పరీక్షా కేంద్రం ఉంటుందన్నారు. 545 మంది అభ్యర్థులు ప్రిలిమ్స్ ద్వారా మెయిన్స్‌కు ఎంపికైనట్లు చెప్పారు.



ఈ చిత్రంలో కనిపించే రైతు పేరు కే.మద్దిలేటి. కల్లూరు మండలం లక్ష్మీపురం వాసి. ఈయనకు 4 ఎకరాల సొంత భూమి ఉండగా.. 10 ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి, పొగాకు, ఉల్లి, శనగ, కంది తదితర పంటలు సాగు చేస్తున్నాడు. గ్రామంలో సీహెచ్‌సీ గ్రూపులు ఉన్నాయి. అధునాతన యంత్ర పరికరాలు, ట్రాక్టర్లు అందుబాటులో ఉండటంతో 100 శాతం యాంత్రీకరణ ద్వారా వ్యవసాయం చేస్తున్నాడు. యాంత్రీకరణ వల్ల పెట్టుబడి వ్యయం బాగా తగ్గిందని, దిగుబడి 10 నుంచి 20 శాతం వరకు పెరిగిందని ఈ రైతు తెలిపారు.



పంపిణీకి సిద్ధమైన ట్రాక్టర్లు

రైతుకు యంత్ర సాయం

- నేడు 96 ట్రాక్టర్లు, 442 ఇంప్లిమెంట్స్ పంపిణీ
- సీహెచ్‌సీ గ్రూపుల బ్యాంకు ఖాతాలకు విడుదల కానున్న రూ.4.66 కోట్ల సబ్సిడీ

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ యాంత్రీకరణను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. వైఎస్ఆర్ యంత్రసేవ పథకం కింద రైతు భరోసా కేంద్రాల వారీగా ఆధునాతన యంత్ర పరికరాలతో కస్టమ్ హయ్యరింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తోంది. ఇప్పటికే జిల్లాలో వేలాది మంది రైతులు యంత్ర పరికరాలను సద్వినియోగం చేసుకుంటూ వ్యవసాయంలో రాణిస్తున్నారు. ఈ ఏడాది జిల్లాలో 96 ట్రాక్టర్లు, 442 ఇంప్లిమెంట్స్ పంపిణీ చేయనున్నారు. రాష్ట్ర వ్యాప్త కార్యక్రమాన్ని శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుంటూరులో ప్రారంభించనున్నారు. జిల్లా స్థాయిలో కర్నూలు శివారులోని సెయింట్ క్లారెట్ ఇంగ్లిషు మీడియం పాఠశాల మైదానంలో కార్యక్రమం జరుగనుంది. జిల్లా కలెక్టర్ సృజన, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరుకానున్నారు. ట్రాక్టర్ల పంపిణీ అనంతరం పెద్ద ఎత్తునర్యాలీ నిర్వహిస్తారు.

సీహెచ్‌సీ గ్రూపులకు రూ.4.61 కోట్ల సబ్సిడీ

జిల్లాలో మొత్తం 466 ఆర్‌బీకేలు ఉండగా గతేడాది వరకు 307 ఆర్‌బీకేల్లో సీహెచ్‌సీలకు రూ.11.75 కోట్ల సబ్సిడీతో ట్రాక్టర్లు, ఇప్లిమెంట్లు, కంబైన్డ్ హార్వెస్టర్లు పంపిణీ జరిగింది. తాజాగా 159 ఆర్‌బీకేల పరిధిలో కస్టమ్ హయ్యరింగ్ సెంటర్లు ఏర్పాటు కానున్నాయి. శుక్రవారం ఒక్కరోజునే రూ.12.88 కోట్ల విలువ కలిగిన ట్రాక్టర్లు, ఇంప్లిమెంట్స్ పంపిణీ చేస్తుండటం విశేషం. రూ.7.48 కోట్ల విలువ కలిగిన 96 ట్రాక్టర్లు రూ.5.10 కోట్ల విలువ కలిగిన 442 ఇంప్లిమెంట్స్. రూ.2.99 లక్షల విలువ కలిగిన కంబైన్డ్ హార్వెస్టర్ పంపిణీ చేయనున్నారు. ట్రాక్టర్లు, ఇంప్లిమెంట్స్, కంబైన్డ్ హార్వెస్టర్ పూర్తి విలువ 12.88 కోట్లు ఉండగా.. 40 శాతం సబ్సిడీ ప్రకారం రూ.4.66 కోట్లు సబ్సిడీ సీహెచ్‌సీ గ్రూపు జాయింట్ బ్యాంక్ ఖాతాలకు విడుదల కానుంది. జిల్లాలో 466 ఆర్‌బీకేలు ఉండగా...100 శాతం ఆర్‌బీకేలలో సీహెచ్‌సీలు ఏర్పాటు అయినట్లు అవుతోంది.

రాజకీయాలకు అతీతంగా యంత్ర పరికరాలు

రాష్ట్ర ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా వైఎస్ఆర్ యంత్రసేవ పథకం సబ్‌మిషన్ ఆన్ మెకనైజేషన్(ఎస్ఎంఏఎం) కింద సీహెచ్‌సీలను మంజూరు చేస్తోంది. రైతులు ఐదుగురు కలసి గ్రూపుగా ఏర్పడాల్సి ఉంది. కన్వీనర్, కో–కన్వీనర్ పేరుతో జాయింట్‌గా బ్యాంకు ఖాతా ప్రారంభిస్తారు. సీహెచ్‌సీ గ్రూపులు ముందుగానే గ్రూపు వాటాతో పాటు సబ్సిడీ అమౌంటు చెల్లించి యూనిట్‌ను గ్రౌండింగ్ చేసుకోవాల్సి ఉంది. ప్రభుత్వం సీహెచ్‌సీ గ్రూపుల బ్యాంకు ఖాతాలకు సబ్సిడీ విడుదల చేస్తుంది. యూనిట్ కాస్ట్‌లో ప్రభుత్వం 40 శాతం సబ్సిడీ ఇస్తోంది. సీహెచ్‌సీ గ్రూపులు 10 శాతం వాటా భరించాల్సి ఉంది. మిగిలిన 50 శాతం జిల్లా సహకార కేంద్రబ్యాంకు లోన్ ఇస్తుంది. సీహెచ్‌సీ గ్రూపుల ప్రతినిధులే ఆయా ప్రాంతాల్లో సాగు చేసే పంటలను బట్టి ట్రాక్టర్లు, యంత్రపరికరాలు ఎంపిక చేసుకునే అవకాశం కల్పించారు. టీడీపీ హయాంలో రైతురథం పేరుతో ట్రాక్టర్లు పంపిణీ చేశారు. ఒక్కటి కూడా నిజమైన రైతుకు పంపిణీ చేసిన దాఖలాలు లేవు. పార్టీ కార్యకర్తలకు మాత్రమే ట్రాక్టర్లు పంపిణీ చేయడం గమనార్హం. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం పారదర్శకంగా కస్టమ్ హయ్యరింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి యంత్ర పరికరాలు అందిస్తోంది.

నియోజకవర్గాల వారీగా ట్రాక్టర్లు, ఇంప్లిమెంట్స్ పంపిణీ వివరాలు..

నియోజకవర్గం	ఆర్‌బీకేలు	ట్రాక్టర్లు
కోడుమూరు	23	11
మంత్రాలయం	20	08
ఆదోని	12	11
ఆలూరు	43	28
పత్తికొండ	26	14
ఎమ్మిగనూరు	21	08
పాణ్యం(కల్లూరు, ఓర్వకల్లు)	14	11
మొత్తం	96	442

యంత్రాల వినియోగం పెంచడమే లక్ష్యం



వ్యవసాయంలో యంత్రాల అవసరం పెరిగింది. గత ఏడాది 307 ఆర్‌బీకేల పరిధిలో సీహెచ్‌సీ గ్రూపులు ఏర్పాటు అయ్యాయి. దీంతో యంత్రాల వినియోగం గణనీయంగా పెరిగింది. తాజాగా 159 సీహెచ్‌సీ గ్రూపులకు 96 ట్రాక్టర్లు, 442 ఇంప్లిమెంట్స్ పంపిణీ చేస్తున్నాం.

– పీఎల్ వరలక్ష్మి, డీఏవో, కర్నూలు